# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-04-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ఎన్.డి.ఎ. పాలన పట్ల దేశ ప్రజలు విశ్వాసంతో వున్నారని బి. జె. పి. సీనియర్ నాయకులు, కేంద్ర మత్స్యశాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్ తెలిపారు.**

**2. ఆంధ్రప్రదేశ్‌లో పదవ తరగతి పరీక్షా ఫలితాలలో బాలికలు అత్యధిక సంఖ్యలో ఉత్తీర్ణులయ్యారు.**

**3. రాష్ట్రంలో వడ గాల్పుల తీవ్రత దృష్ట్యా ప్రజల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ప్రభుత్వం ఆదేశించింది.**

**4. ఎండల తీవ్రత దృష్ట్యా రాష్ట్రంలో అత్యధిక విద్యుత్ వినియోగం జరుగుతోంది.**

**5. రాష్ట్రంలో పాఠశాలకు. విద్యా శాఖ ఈ నెల 24వ తేదీ నుండి వేసవి సెలవులు ప్రకటించింది.**

**==========================**

ఎన్. డి. ఎ. పాలన పట్ల దేశ ప్రజలు విశ్వాసంతో వున్నారని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు ...., కేంద్ర మత్స్య శాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్ తెలిపారు. తిరుపతి నగరంలో జ్యోతీ రావు పూలే విగ్రహం నుండి ఎన్. డి. ఎ. కూటమి లోక్ సభ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వర ప్రసాద రావుతో కలిసి ఈ రోజు ఆయన ర్యాలీలో పాల్గొన్నారు. వరప్రసాదరావు నామినేషన్ పత్రం దాఖలు చేసిన అనంతరం మురుగన్ పాత్రికేయులతో మాట్లాడుతూ ..... కూటమి అభ్యర్థులు ఆంధ్ర ప్రదేశ్ లో విజయం సాధిస్తారని దీమా వ్యక్తం చేశారు. దేశం వికసిత భారత వైపు పయనిస్తోందని ...., ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయని ...., ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే ఎన్.డి. ఎ. కూటమి అధికారంలోకి రావలసిన అవసరం వుందని మురుగన్ అన్నారు.

--------------------------

రాష్ట్రంలో ఈ రోజు విడుదలైన పదవ తరగతి ఫలితాలలో బాలికలు అత్యధిక సంఖ్యలో ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది మొత్తం 6 లక్షల 16 వేల 615 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మొత్తం 86.69 శాతంతో 5 లక్షల 34 వేల 574 మంది ఉత్తీర్ణులయ్యారని విజయవాడలో ఫలితాలను విడుదల చేస్తూ పాఠశాల విద్యా శాఖ కమిషనర్ తెలిపారు. బాలికలు 89.17 శాతం ఉత్తీర్ణత సాధించగా ....., బాలురు 84.32 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. తెలుగు మాధ్యమంలో 71.08 శాతం ఉత్తీర్ణత శాతం నమోదవగా ...,ఆంగ్ల మాధ్యమంలో 92.32 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.

--------------------------

కడప జిల్లా ఒంటిమిట్టలో ఈరోజు సాయంత్రం శ్రీ సీతారాముల కళ్యాణం ఘనంగా జరగనున్నది. ఈ కళ్యాణ కార్యక్రమానికి తిరుమల తిరుపతి దేవస్థానం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శ్రీరాముని ఆలయాలలో శ్రీరామ నవమి రోజున కళ్యాణం నిర్వహిస్తారు. ఒంటి మిట్ట పుణ్య క్షేత్రంలో మాత్రం నవమి తరువాత చతుర్దశి రోజున పండు వెన్నెలలో శ్రీ సీతారాముల కళ్యాణ కార్యక్రమం జరుగుతుంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి దృష్ట్యా ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన రెడ్డికి బదులుగా దేవాదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వడగాల్పుల తీవ్రత దృష్ట్యా ప్రజల రక్షణ కోసం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లాల వైద్య శాఖల అధికారులను రాష్ట్ర ఆరోగ్య ...., కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ వేంకటేశ్వర్ ఆదేశించారు. వడదెబ్బకు గురైన వారికి తక్షణమే చికిత్స అందించాలని సూచించారు. గర్భిణులు ...., చిన్నారులు ...., వృద్ధుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ..., ఓ. ఆర్. ఎస్. ప్యాకెట్లు ..., ఐవి ఫ్లూయిడ్స్ అందుబాటులో ఉంచుకోవాలని ప్రజల రక్షణ విషయంలో పూర్తి అప్రమత్తంగా ఉండాలని కూడా వేంకటేశ్వర్ ఆదేశించారు.

వడ దెబ్బకు గురైన వారికి చికిత్స అందజేయడం కోసం ప్రత్యేకంగా ఒక గదిని ఏర్పాటు చేయాలని ....., అంబులెన్స్‌లలో ఐ వి ప్యాక్స్‌ను కూడా సిద్ధంగా ఉంచుకోవాలని కూడా డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలలకు ప్రభుత్వం ఈ నెల 24 వ తేదీ నుండి వేసవి సెలవులు ప్రకటించింది. ప్రస్తుతం ఒకటి నుండి తొమ్మిదవ తరగతి వరకు విద్యార్థులకు ఒంటి పూట బడులు కొనసాగుతున్నాయి. వారికి కూడా వార్షిక పరీక్షలు ముగింపు దశకు చేరుకోవడంతో ఈ నెల 24వ తేదీ నుండి వేసవి సెలవులు ఇస్తున్నట్టు విద్యా శాఖ అధికారికంగా ప్రకటించింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఈ నెల 23వ తేదీ ఆఖరి పని దినమని ...., అదే రోజు విద్యార్థులకు మార్కుల జాబితాలను అందిస్తామని ..., వచ్చే జూన్ 12 వ తేదీన పాఠశాలలు పునః ప్రారంభమవుతాయని విద్యా శాఖ పేర్కొంది. ఈ ఆదేశాలు పాటించని పాఠశాలలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

---------------------------

రాష్ట్రంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు వారి పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించిన ఫారంన్- 12ను సమర్పించే గడువును ఈ నెల 26వ తేదీన వరకు పొడిగించినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన నిన్న ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగులు ఎక్కడ పని చేస్తుంటే అక్కడే ఫారం -12 ను పూర్తి చేసి సమర్పించవలసి ఉంటుంది. ఇతర జిల్లాలలో పని చేస్తున్న ఉద్యోగులు తమ ఫస్ట్ సెంట్రల్ ఎక్స్ఛేంజ్ ను ఈ నెల 28 వ తేదీన సచివాలయం లో సమర్పించాలి. వినియోగించని బ్యాలెట్‌లు ...., మిగిలిపోయిన బ్యాలెట్‌లను అధికారులకు అందజేసి రసీదులను పొందవలసి వుంటుందని ఆ ఉత్తర్వుల్లో ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు.

---------------------------

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని.. స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని తిరుపతి జిల్లా ఎస్పీ క్రిష్ణకాంత్ పటేల్ పేర్కొన్నారు.

తిరుపతి రూరల్ పోలీస్టేషన్ పరిధిలో ఉన్న అవిలాల, తుమ్మలగుంటలలో ఈరోజు ఉదయం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. తిరుపతి జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతులో పాల్గొన్నాయి. తిరుపతి రూరల్ పోలీస్టేషన్ పరిధిలో ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్లను చైతన్యవంతులను చేస్తూ కేంద్ర సాయుధ బలగాలతో కవాతును నిర్వహించామని ఎస్పీ పాత్రికేయులకు తెలిపారు.

---------------------------

ఎండల తీవ్రత దృష్ట్యా రాష్ట్రంలో రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం జరుగుతోంది. రాష్ట్ర డిస్కంల చరిత్రలోనే గరిష్టంగా గత రెండు రోజులుగా 13 వేల 5 వందలకు పైగా మెగావాట్ల విద్యుత్ వినియోగం నమోదవుతోంది. గత ఏడాది మార్చి 7 వ తేదీన 13 వేల 255 మెగావాట్ల వినియోగం నమోదైంది. ఇప్పటి వరకు అదే అత్యధికంగా వుంది. కాగా ... ప్రస్తుతం రోజుకు విద్యుత్ వినియోగం సగటున 242.65 మిలియన్ యూనిట్లు ఉంటోంది

---------------------------

తిరుమలలో శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఈ ఉదయం శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీ మలయప్పస్వామి స్వర్ణరథంపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అత్యంత వైభవంగా సాగిన స్వర్ణ రథోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. గోవిందనామాలు జపిస్తూ రథాన్ని లాగారు. రథోత్సవంలో పాల్గొనడం వల్ల లక్ష్మీదేవి కరుణతో సంపదలు, భోగభాగ్యాలు.. భూదేవి కరుణతో సమస్త ధాన్యాలూ.. శ్రీవారి కరుణా కటాక్షాలతో సర్వశుభాలూ, సుఖాలూ చేకూరుతాయని భక్తుల విశ్వాసం.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఎండల తీవ్రతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరిగి పోతుండడం...., ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు రాష్ట్ర వ్యాప్తంగా పలు నగరాలు ...., పట్టణాలలో గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నంద్యాల జిల్లా చాగలమర్రి..., తిరుపతి జిల్లా రేణిగుంట పట్టణంలో నిన్న 45.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ప్రకాశం జిల్లా దరిమడుగులో 44.2 ..., అనంతపురం జిల్లా తరిమెలలో 44.2 ...., కడప జిల్లా బలపనూరులో 43.8 ...., పల్నాడు జిల్లా రావిపాడులో 43.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇంకా పలు పట్టణాలలో కూడా ఇదే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుతం వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి డి.శేషసాయి కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్... సెకన్లు...

---------------------------

తమ పార్టీ అధికారంలోకి వస్తే ఉద్యోగులకు ఒకటవ తేదీనే వేతనాలు అందిస్తామని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళగిరి మండలం కాజాలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మారినప్పుడల్లా పరిశ్రమలు తరలిపోకుండా ప్రత్యేకమైన చట్టాన్ని తీసుకొస్తామనిఅన్నారు. పారిశ్రామికవేత్తలకు ఇచ్చే రాయితీలను చట్టబద్ధం చేస్తామని లోకేష్ పేర్కొన్నారు.

---------------------------

పి హెచ్ డి చేయాలని కోరుకునే విద్యార్థులకు విశ్వ విద్యాలయాల గ్రాంట్ల సంఘం....యుజీసీ.... వెసులుబాటు కల్పించింది. నాలుగేళ్ల బ్యాచులర్ డిగ్రీతో ఇక నుండి నేరుగా జాతీయ అర్హత పరీక్ష... ఎన్ఈటీ..... కు హాజరు కావచ్చునని ప్రకటించింది. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ ...జెఆర్ఎఫ్తో సంబంధం లేకుండా తమ డిగ్రీతో సంబంధం లేని ఏ సబ్జెక్టులోనైనా పి హెచ్ డి ని అభ్యసించవచ్చుననీ తెలిపింది. అయితే ...... ఇందు కోసం తమ నాలుగేళ్ల డిగ్రీలో విద్యార్థులు కనీసం 75 శాతం ఉత్తీర్ణత సాధించాలని పేర్కొంది.

---------------------------

దేశ వ్యాప్తంగా ఐఐటీలు ...., ఎన్ఐటీ లలో ప్రవేశాలకు నిర్వహించిన జెఈఈ మేన్-2 ఫలితాలు ఈ నెల 25 వ తేదీన విడుదల కానున్నాయి. ఈ ఫలితాల విడుదల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల నాలుగు నుండి 12 వ తేదీ వరకు జరిగిన ఈ పరీక్షలకు దాదాపు 12 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. సంబంధిత వెబ్ సైట్ నుండి అభ్యర్థులు తమ స్కోర్ కార్డును పొందవచ్చు. అర్హత సాధించిన రెండున్నర లక్షల మందికి అడ్వాన్స్ డ్ పరీక్ష రాసే అవకాశం లభిస్తుంది.

=======================